

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**పబ్ అంతా టీనేజ్,** అంతకి మించి కాస్త వయసున్న వాళ్ళతో యవ్వనంతో ఉత్సాహంగా వుంది. బార్ ఎటెండర్స్ అందంగా, చలాకీగా గ్లాసుల గలగలలతో అటూ ఇటూ తిరుగుతున్నారు.

అతను వెళ్ళి బీర్ తెచ్చి, ఒక గ్లాస్ నాకిచ్చి 'ఛీర్స్ ' అన్నాక నెమ్మదిగా అన్నాను.

"ఇలా ఎందుకు జరుగుతోంది?"

"ఏంటి?" ముందుకి ఒంగి అడిగాడు.

"నేను.. నువ్వు.. ఇష్టపడుతున్నామా? ప్రేమించుకుంటున్నామా? కలిసి వుందాం అనుకుంటున్నామా?"

"క్లారిఫికేషన్ అడుగుతున్నావా?" నవ్వాడు.

బీర్ సిప్ చేసి అన్నాడు "ప్రయాణం కొన్ని గంటలే వేస్ట్ చెయ్యకు. వున్నంతసేపూ అందంగా మలుచుకుందాం అన్నాను గుర్తుందా? లేకపోతే ఏదో నవల చదువుకుని టీవీ చూసి నిస్సారంగా దిగిపోతాం. కొన్ని స్మృతులూ కొన్ని అనుభూతులూ మిగిలేవి కావు. జీవితం కూడా అంతే పెద్ద ప్రయాణం. కొన్ని అనుభూతులూ కొన్ని జ్ఞాపకాలూ పుట్టుమచ్చల్లా కాకపోయినా పచ్చబొట్లలా మిగిలిపోతాయి. అనీజీగా వుంటే, ఈ నిమిషంలో తీసుకెళ్ళి మీ ఇంటి దగ్గర దింపేస్తాను సరేనా?"

గ్లాస్ మీద వేలితో గుండ్రంగా రాస్తూ అన్నాను "మాది చాలా సనాతనాచారల ఫ్యామిలీ. నాన్న బీర్ తాగొస్తే బామ్మ పడుకున్నాక కానీ రాడు. నేను కాలేజ్ కొచ్చాక కూడా నాన్న సిగరెట్ తాగొస్తే బామ్మ ముక్కు చివాట్లు పెట్టడం నాకు ఆశ్చర్యం. అమ్మ నాన్నతో చెప్పకుండా ఇప్పటికీ సినిమాకి కూడా వెళ్ళదు. ఆయనకి నచ్చని రంగుచీరా, రుచించని కూరా

మా ఇంట్లో వుండవు. నన్నూ అలాగే కట్టుబాట్లతో పెంచి, వాళ్ళు చూసిన ఓ వెంకట్రావునో, గోపాల్రావునో ఇచ్చి పెళ్ళిచేసి, మనవలని ఎత్తుకుని మురవాలని కోరుకుంటున్నారు. నేనిలా నీతో మందుకొట్టడం గురించి తెలిస్తే, తట్టుకోలేరు" అన్నాను.

అతను నవ్వాడు. "వెంటనే చెప్పెయ్యి. వాళ్ళని ప్రిపేర్ చెయ్యి. వాళ్ళ దగ్గర దాచడం అన్న బాధ నీ ఈ ఆనందాల్ని మింగేస్తుంది. నీలా ఈ కాలంలో బతుకుతూ గతంలో జీవించేవాళ్ళు చాలామంది" అన్నాడు.

"ఏం చెప్తాను. నేను ఓ స్ట్రేంజర్ ఫ్లయిట్‌లో కలిస్తే, ఎక్కువ వివరాలు తెలీకుండా ముద్దుపెట్టించుకున్నా. అతనితో ఓ రెండు వారాల తర్వాత మందు కొట్టా. స్టిల్ అతను నాకు స్ట్రేంజరే అనా?" అన్నాను.

"ఫ్రెండ్ అని చెప్పు. ఇన్ని జరిగాక స్ట్రేంజర్ ఏంటి?" అన్నాడు.

"అమ్మ అడుగుతుంది వెంటనే మన వాళ్ళేనా? పెళ్ళి చేసుకుంటాడా? అని" అన్నాను.

"డార్విన్ థియరీ ప్రకారం మనవాళ్ళే. పెళ్ళి అనేది రెండు మనసుల కలయిక. ఇద్దరు మనుషుల మధ్య స్నేహం అయితే చేసుకుంటాడు. పెళ్ళి అంటే లోకానికి మేమిద్దరం బెడ్ పంచుకుంటాం అని తెలియడం అయితే బాజాలూ, పసుపుతాడూ, అనవసరపు ఖర్చు ద్వారా అలాగే చేసుకుంటాం అని చెప్పు" అన్నాడు.

నేను షాక్ అయ్యాను. అచ్చు మనలాగే మాట్లాడేవాళ్ళని మనం భరించలేం.

"నా గురించి నీకేం తెలుసు?" అడిగాను.

"డెఫినెట్‌గా నేర చరిత్ర లేదనుకుంటున్నాను. మొదటి రాత్రి భర్తకి పాలల్లో నిద్రమాత్రలు కలిపిచ్చి నగలూ, నగదుతో పరారయిన కిలాడీ లేదా ..లాంటి యూట్యూబ్ సరంజామా కాదు. యూ ఆర్ డీసెంట్, ఎడ్యుకేటెడ్, తెలివైన, అర్థం చేసుకునే మోడ్రెన్ అమ్మాయి అనుకుంటున్నాను."

"మరి నువ్వు సీరియల్ కిల్లర్‌వో, కంటెయినర్‌లో అమ్మాయిలని అమ్మేవాడివో కాదని నాకెలా నమ్మకం?" అతని ధోరణిలోనే అడిగాను.

"అరెరే.." పెదవి కొరుక్కున్నాడు.

" దుబాయి వాడికి ఇవ్వబోయి మాల్ రెడీ.. 26ఏళ్ళ అందమైన 'ఖసక్'లాటి పిల్ల అన్న మెసేజ్, నిషాలో నీకిచ్చేసానా?" అని.

"చాల్లే జోక్. ఒకవేళ ఇంట్లో వాళ్ళు పెళ్ళిచేసుకోమని తొందరపెడ్తేనో?" అన్నాను.

"చెప్పు వాడికి తాడూ బొంగరం లేదు. నా కాళ్ళమీద నేను నిలబడి ఏ ఫుడ్ ట్రక్కో పెట్టాక పెళ్ళి చేసుకుంటానని. కానీ పిల్లా జెల్లా పుడితే డైపర్‌లు మార్చి, పాలు పట్టించి, చక్కగా పెంచగలడు అని చెప్పు" అన్నాడు.

ఇద్దరం నవ్వుకున్నాం. ఆడది ఎందుకో సమానత్వం, స్వతంత్రభావాలూ అని మాట్లాడి పెళ్ళిదాకా వచ్చేసరికి అతని ఉద్యోగం, ఆస్తీ, పర్సూ చూస్తుంది.

ధైర్యంగా తను డాక్టరో ఇంజనీరో అయినా, ఉద్యోగం నాకుందిగా ఫర్వాలేదు పెళ్ళి చేసుకుందాం అనదు. కన్నవాళ్ళకోసం, లోకుల కోసం కొన్ని అబద్ధాలైనా చెప్తుంది. ఆయన స్టార్టప్ పనుల్లో వున్నారు అని. అదే మగాడికి యుగయుగాలుగా, స్త్రీని నువ్వే పోషించాలి, ఆమె ఫ్యాన్సీలతో, లగ్జరీ లస్ట్‌లతో సహా అని నేర్పించి పెంచుతారు.

"పద..మీ ఇంటికెళదాం" అన్నాను.

నా బీర్ పూర్తి అవలేదు.

అది ఇల్లు కాదు మేన్షన్. అత్యంత అందమైన కట్టడం లోపల ఇంకా అద్భుతంగా వుంది. పెయింటింగ్స్, శిల్పాలూఇంట్లో వాళ్ళ అభిరుచిని పట్టిస్తున్నాయి.

నేలంతా చాలా ఖరీదైన తివాచీ పరిచి వుంది .పాలరాతితో నగిషీలు చెక్కిన సింహాలు, ద్వారానికి అటూ ఇటూ వున్నాయి. కార్పెట్ పిల్లి పిల్లలా మెత్తగా కాలి కింద హాయిగా వుంది. తైల వర్ణ చిత్ర పటాలు వున్నాయి గోడలకి. పెద్ద పెద్ద కాండిల్ స్టాండ్స్ లతలూ, తీవెలూ చెక్కినవి.

కళ్ళు ఇంతింత చేసుకుని ఇల్లంతా చూస్తూ నిలబడ్డాను. అద్భుతంగా అనిపించింది.

"కమ్.. అమ్మని కలుద్దువుగాని" అన్నాడు ద్వారక.

అతని వెనకే వాళ్లమ్మగారి గదిలోకి నడిచాను.

దేవకిగారు మంచమ్మీద పడుకుని వున్నారు. "అమ్మా" అన్న అతని పిలుపుకి, కళ్ళు తెరిచి గుండెలమీదున్న పుస్తకం తీసి పక్కన పెట్టి, ద్వారం వైపు చూసారు.

ద్వారక వెళ్ళి మంచం మీట నొక్కి దాన్ని పైకి లేపి, ఆవిడ కూర్చున్నట్లుగా చేసి "రుషి వచ్చిందమ్మా" అన్నాడు.

ఆవిడ అతని తలమీదుగా నన్ను చూసి, "రా బంగారు తల్లీ.. రారా" అన్నారు. ఎంత ఆప్యాయత వెల్లివిరిసిందంటే, ఆవిడ గొంతులో, నేను వెళ్ళి మంచం మీద ఆవిడ పక్కన కుర్చుని, ఆవిడ చేతిని నా చేతిలోకి తీసుకున్నాను.

"ఎలా ఉన్నారూ?" అడిగాను.

"దివ్యంగా.. మా ద్వారక నా దగ్గరుంటే ఎలా వుంటానూ?" అందావిడ

"మీరు మాట్లాడ్తూ వుండండి. ఇప్పుడే వస్తాను" అని ద్వారక లోపలికి వెళ్ళాడు. లూసీ, ఆవిడ కేర్‌టేకర్ వచ్చి, ఆవిడ దిళ్ళు సరిచేసింది. నన్ను "ఎ ఫ్రెండ్ ఫ్రం ఇండియా" అని దేవకిగారు పరిచయం చేసారు. ఆమె విష్ చేసి, దూరంగా వున్న చెయిర్‌లో కూర్చుంది.

"రుషీ మీదేవూరూ? మీ నాన్నగారు ఏం చేస్తారూ? " అని ప్రశ్నలు వేశారు. అన్నింటికీ సమాధానాలు చెప్పాను. ఆవిడ నిశితంగా నన్ను పరిశీలిస్తూ, ఎంతో ఆతృతతో ఏదో శోధిస్తున్నట్లు చూడడం వల్ల, ఆవిడ మనసులో ఏముందో నాకు అర్థం అవుతోంది .మా అమ్మకి వున్నట్లే ఆవిడకీ కొడుకు ఒక ఇంటివాడు అవ్వాలని ఆలోచన. సహజం కదా!

ఆవిడ పక్కనున్న టేబుల్ మీద ఒక ఫోటో వుంది. చిన్నబాబు, ఒక మీసాలున్న మిలటరీ మనిషిలాంటి ఆయనతో. నా చూపు వచ్చిన దెస చూసి "మా ద్వారకే నమ్మా. వాళ్ళ నాన్నతో. ఆయన పేరు దేవేంద్రనాథ్. ఇద్దరం కలిసే అమెరికా వచ్చాం. నేను చదువుకుని ఉద్యోగంలో చేరాను. ఆయనకి ఇండియా మీదకీ, తన వాళ్ళ మీదకీ గాలి మళ్ళింది వెళ్ళిపోదాం అన్నారు. నేను ఇక్కడ జీవితానికి అలవాటు పడ్డాను. నా ఉద్యోగం, జీతం, జీవితం, సౌకర్యాలూ అన్నీ నన్ను దేశం విడిచి పెట్టనివ్వలేదు. నేను రాను అన్నను. ద్వారకని తీసుకుని వెళ్ళిపోయారు. నేను పట్టుదలగా విడిపోయాను. ఆయన జీవితం ఆయన ఏర్పరుచుకున్నారు. నేను ఒంటరిగా నా బ్రతుకు నేను గడుపుతుండగా అనుకోని ఏక్సిడెంట్, నా కాళ్ళు పోయాయి. అప్పుడు తెలిసింది జీవితంలో ఏం కావాలో... ఒక తోడు కావాలి నా అనే తోడు కావాలి. భోగాలూ, సౌకర్యాలూ కాదు. డబ్బుతో పనివాళ్ళని పెట్టుకోవచ్చు. కానీ పాశాలూ, ఆత్మీయతలూ కొనుక్కోలేము. భగవంతుడు నన్ను అనాధని చేసాడు. ఆ స్థితిలో నేను ఏడుస్తుంటే నా ఏడుపు చూసి భగవంతుడే నా కన్నకొడుకు రూపంలో ద్వారకగా వచ్చాడు. "ఈ విషయం తెలిసాక రాకుండా ఎలా వుండగలనమ్మా?" అని అడిగాడు.

అప్పటినుండి నాకాళ్ళు లేవన్న బాధ లేదు నాకు. నా కొడుకొచ్చాడు అన్న ఆనందం తప్ప" ఆవిడ కళ్ళు నీటి చెలమలే అయ్యాయి. గొంతు వణికింది. నా చేతిని తన చేతిలోకి తీసుకుంది.

ద్వారక గురించి ఆవిడ చెప్పిన మాటలు విన్నాక, అతని స్వభావం నాకు తేటతెల్లం అయింది.

"ఐస్‌క్రీం టైం" అంటూ ద్వారక ఐస్‌క్రీం కప్పులు ట్రేలో తీసుకొచ్చాడు.

"ఈ వెదర్‌లో ఐస్‌క్రీంలా?" అన్నాను.

"హాట్ టాపిక్ మాట్లాడినట్లుందిగా మా ప్రొఫెసర్" అన్నాడు.

ఇద్దరం నవ్వుకున్నాం

"వచ్చిన వాళ్ళందరికీ ఫ్లాష్ బ్యాక్ వేసేస్తావా?" దేవకిగారిని అడిగాడు ద్వారక.

ఆవిడ కళ్ళు తుడుచుకుంటూ "ఏదో ఆ అమ్మాయిని చూడగానే ఆత్మీయురాలులా అనిపించిందిరా" అంది.

ముగ్గురం కాసేపు కబుర్లు చెప్పుకున్నాం. ఆవిడ బాగా కబుర్లు చెప్పగలదు. పక్కన ర్యాక్‌లో వున్న పుస్తకాలు ఆవిడ ఎంత చదువరో చెప్పాయి. ఏ సబ్జెక్ట్ అయినా బాగా మాట్లాడగలదు. సినిమాలూ, సాహిత్యం, ఫిలాసఫీ అన్నీ.

ఆవిడకి నిద్రొస్తుండగా, లూసి టాబ్లెట్స్ తెచ్చి ఇచ్చి, సూప్,రెండు శాండ్ విచెస్ ప్లేట్‌లో పెట్టింది.

"రాతిపూట అమ్మ లైట్‌గా తింటుంది. మనకి ఫుడ్ ఆర్డర్ ఇచ్చాను..రా" అన్నాడు ద్వారక.

"గుడ్‌నైట్ అండీ" అన్నాను

"గాడ్ బ్లెస్‌యూ డియర్" అందావిడ.

మేం ఇద్దరం ద్వారక గదిలోకి వచ్చాం. అతని రూము చూస్తూ "ఇవన్నీ ఆంటీ సంపాదన మీద కొన్నవేనా?" అని అడిగాను.

అతను నవ్వి "లేదు మమ్మీకి ప్రొఫెసర్‌గా అంత ఎక్కువ సంపాదనేం లేదు. నేను బిజినెస్ మొదలుపెట్టాకే ఈ ఇల్లు కొన్నాను. అమ్మని సుఖపెట్టాలి. అదే నా జీవిత ధ్యేయం" అన్నాడు.

ద్వారక మొహం బెడ్‌లైట్ పడి మెరుస్తోంది. అతని తీరు నాకు అర్ధమైంది 'తన' అనుకున్న వాళ్ళు సుఖపడాలి. తన శక్తి మేరా అందుకు కృషి చేస్తాడు. తండ్రి దగ్గర సకలభోగాలూ అనుభవిస్తూ, తనకి ఇష్టమైన ఇండియాలో వుండొచ్చు కానీ తల్లి ఏక్సిడెంట్ గురించి తన బాధ్యత నెరవేర్చడానికి వచ్చాడు.

ఇందాకా నీ గురించి నాకేం తెలుసు? అన్నాను. నాకు జవాబులు దొరికాయి.

"ఏంటి ఆలోచిస్తున్నావు?" అన్నాడు.

నేను అతని గెడ్డం కింద రెండు చేతులు వుంచి అతని మొహాన్ని నా దగ్గరగా తీసుకుని, అతని పెదవులమీద గాఢంగా చుంబించాను.

అతను కుడి చెయ్యి నా నడుం చుట్టూ వేసి ఎడమ చేత్తో నా మొహాన్ని, తన మొహానికి హత్తుకుని పెదవులని తన పెదవులతో బంధించాడు.

'అ..బ్బా' అన్న అరుపు సన్నగా వెలువడింది నా నుండి. అతని పన్ను నా పెదవికి గుచ్చుకోగానే.

ఆ రాత్రి నాకు నిద్ర రాలేదు.

మనసు తప్పు ఒప్పులు గురించి ఆలోచించనివ్వడంలేదు. తనకేం అనిపించిందో అదే చేసింది. అతన్ని నేను ఇష్టపడ్డాను. ఇది ప్రేమా? వివాహబంధంలో ఇరుక్కుని చివరిదాకా వెళ్తుందా నాకు తెలీదు. నా తొలి యవ్వనపు అనుభవాన్ని ఎప్పుడూ ఎట్టి పరిస్థితిలో ఈ మకరందం గ్రోలిన తియ్యని అనుభవాన్ని అతడు మోసం చేసాడు, తనవాంఛ తీర్చుకున్నాడు, నాకు అన్యాయం జరిగిందీ...లాంటి చీప్ ఆలోచనలతో ముడిపెట్టను. అద్దంలో చూసుకున్నాను. నేను ఎప్పటిలాగే కనిపిస్తున్నాను. కళ్ళు దీప్తివంతం అయ్యాయి. పెదవులు మరింత నిండుదనాన్ని సంతరించుకున్నాయి. ఇందాకటి మధువేదో కొన్ని చుక్కలు పెదవి అంచున మిగిలిపోయి వున్న తియ్యని అనుభూతి.

ఒకప్పుడు పాత సినిమాలు చూస్తూ అంతా అయిపోయాక హీరోయిన్ తన ప్రమేయం లేనట్లు, హీరోని దోషిలా చూస్తూ దుప్పటి కప్పుకుని వెక్కి వెక్కి ఏడవడటం అతను "నన్ను క్షమించు. నీకు అన్యాయం చెయ్యను లతా. నిన్ను అగ్ని సాక్షిగా పెళ్ళి చేసుకుంటాను" అని అక్కడ వెలుగుతున్న మంటమీద చెయ్యిపెట్టి, ప్రమాణం చెయ్యడం తన బొటనవేలు కోసుకుని, ఆ రక్తం ఆమె నుదుటినా, హిందీ సినిమా అయితే, ఆమె పాపిటిలో పెట్టడం ఆమె వెంటనే ఎంతో ఆనందం, భక్తీ ముప్పిరిగొనగా 'నాధా.. నువ్వే నా ప్రాణనాధుడివి. ఈ జన్మకీ వరం చాలు అంటూ అతని కాళ్ళకి దణ్ణం పెట్టి, అరికాళ్ళలో దుమ్ముకోసం తడిమి, అతను బాలన్స్ అవుట్ అయి పడేట్లు చేసి, ఆ దుమ్ము నెత్తిన రాసుకుని "మీ పాద ధూళిచాలు నేను నిశ్చింతగా బతకడానికి" అని డయిలాగ్ కొట్టడం.

అతని మొహంలో గొప్ప నిశ్చింత. అమ్మయ్యా, ఓ డ్రాప్ రక్తం పోయినా, గొప్ప న్యాయం చేసేసాను. ఈ రోడ్లమీద పెంటల్లో తిరిగిన కాళ్ళ 'దుమ్ము' చాలుట. నిశ్చింతగా ఈమె బ్రతుకు గడిపెయ్యడానికి అని. ఆ తర్వాత అతను విదేశాలకి వెళ్ళడం.. ఆమె ఆ నెలే "వాక్..వాక్" అని. సమాజం అనబడే పక్కింటి సూరమ్మా, కూరలమ్మే బాలయ్యా, వదినా, స్నేహితురాళ్ళూ.

"ఈ బిడ్డకి తండ్రి ఎవరంటే ఏం చెప్తావు? ఎలా పెంచుతావు? సమాజానికి ఏం జవాబు చెప్తావు? అంటూ మొహం మీద చూపుడు వేలు పెట్టి, ఆమె చుట్టూ తిరుగుతూ, దెయ్యాల్లా నవ్వడం. "నో..." అని స్టీరియోఫోనిక్ సౌండ్‌తో హీరోయిన్ అరిచి, ఫ్యాన్‌కి తన చీర వేసి, ఉరివేసుకుని వేళ్ళాడడం. పక్కింటి చలం చూసి, కాళ్ళు పట్టుకుని, ఆమెని దింపేదాకా భారీ డైలాగ్స్ కొట్టడం, కడుపొస్తే ఇదొక్కటే సొల్యూషన్ అని ఫ్యాన్‌కి వేళ్ళాడడం. నాగయ్యగారో, గుమ్మడిగారోలాంటి తండ్రి వుంటే..

"ఛీ..నీచురాలా ఎంత పని చేసావే? ఛీ..కులటా చావు. నేనూ చస్తాను" అని గుండె నెప్పొచ్చి, గుండె పట్టుకుని, వెక్కిళ్ళు పెట్టి, "టింగ్" మన్న చప్పుడొచ్చాక పక్కకి పడిచావడం ఇలాంటి దృశ్యాలు వుండేవి.

కొంపదీసి నాకూ నెల తప్పదుకదా! సేఫ్టీ పిరేడ్ ఎలా లెక్కపెడ్తారు? పక్క గదిలో వున్న పరిమళని లేపి అడుగుదామా? అమ్మో ఈ కాలంలో ఫ్యాన్‌కి వేళ్ళాడలేము కానీ అమెరికాలో అబార్షన్ బ్యాన్‌ట. పిల్లల్ని కనేతీరాలట. రుష్యేంద్రమణీ, శ్రీరంజనీ కాలం సినిమాల్లోలాగా. మరి ఇండియాలో? తెలిసిన లేడీ డాక్టర్ ఎవరున్నారూ?

మళ్ళీ తెలుగు సినిమాలు, వసుంధరతో కలిసి కూర్చుని చూసినవి గుర్తొచ్చాయి. నేను అబార్షన్ కోసం సిద్దమవడం ఎదురుగా కేలండర్ మీదున్న ముద్దులొలికే పాపాయి బొమ్మ కదులుతూ "అమ్మా నన్ను కడుపులోనే చంపేస్తావా? ఈ అందమైన ప్రపంచాన్ని చూసే హక్కు నాకు లేదా? భ్రూణ హత్య చేస్తావా? నువ్వు హంతకురాలివా అమ్మా?

"నో!" అని స్టీరియో ఫోనిక్ సౌండ్‌తో అరుస్తూ లేచాను. టేబుల్ మీద వాటర్ జగ్ షేకయిపోయింది. మంచినీళ్ళు తాగాను. దోమ వాలితే ఒంటిమీద రక్తం అవుతుందని చేత్తో కొట్టలేని నేను నా కడుపులో బిడ్డని చంపుతానా? అసలు దీనికి నాతోబాటు కారణం అయిన పర్సన్, అక్కడ గురకలు పెడుతూ నిద్రపోతాడా? ఫోన్ వైపూ, గడియారం వైపూ చూసాను. రాత్రి ఒంటిగంట దాటింది. ఫోన్ చేసి అడగాలి.

"ఇదెక్కడి న్యాయం ద్వారకా నేను హత్యలు చేస్తుంటే నువ్వు గురకలు పెట్టి నిద్రపోతావా?"

"ఏం హత్యలూ?" అంటాడు.

అప్పుడు "నువ్వు కనీసం కండోం వాడే బాధ్యత తీసుకోలేదు నాకు కడుపొస్తేనో?" అంటాను.

"మరి నువ్వెందుకు కండోం ఇవ్వలేదూ?" అంటాడేమో.

"నేను ఒక మగాడు డిన్నర్‌కి పిలిస్తే నోట్ యువర్ ఆనర్. డేట్ కూడా కాదు. డిన్నర్‌కి అని పిలిస్తే, కండోం కొని పర్స్‌లో పెట్టుకుని వెళ్ళి, అతనికి అంతదాకా లేని ఊహ ఇవ్వాలా? సరే అసలు నేను కండోం ఎలా కొనాలి? ఎంత తెలీని

దేశం అయినా నేను ఇది కొనేటప్పుడు, తెలిసిన అప్పారావో సారీ, అల్వినో, లూసీనో చూసి, "ఇది ఇలాంటిదా? అనుకుంటేనో?"

మనసు మళ్ళీ మాట్లాడడం మొదలు పెట్టింది.

"ఏం ఇలాంటిదీ అలాంటిదీ అని వుంటుందా? ఆదపిల్లవేగా. ఈ పని చేస్తే కదుపొస్తుందని, రెయిన్ పడ్తుంటే, తన షర్ట్ విప్పి, నీ చీర తీసి ఆరబెట్టి, "కురిసింది వానా. నా గుండెలోనా నీ చూపులే జల్లుగా.." అని పాడుతుంటే తర్వాత జరిగేదేంటో తెలీదా? ఈ రోజుల్లో ఆ మంటనీ తర్వాత పెంటనీ వూహించి కండోం కొంటే..ఛీ! నువ్విలాంటి దానివా? అని ఎవరు అంటారూ? అందులోనూ అమెరికాలో.. పర్స్‌లో లిప్‌స్టిక్కూ, ఐబ్రో పెన్సిల్ అద్దం, మోయిస్చరయిజర్, ఫోన్ బ్యాంక్.. నావల్లకాదు కాదు. ఇష్టం లేకపోతే పెప్పర్ స్ప్రే, ఇష్టం అయితే కండోం ప్యాకెట్ పెట్టుకోవాలి. ట్రింగ్.. ట్రింగ్.. ఎడ్వర్‌టైజ్‌మెంట్‌కిలాగా, ఏదో శబ్దం వచ్చినట్లు అనిపించింది.

చేతిలో ఫోన్ వైపు చూసాను. చేసిన పని వల్ల నేను "నిద్రకి వెలినై నేనొంటిరినై" కుమిలిపోతూ, అతనికి నిద్రాభంగం అవుతుందని ఆలోచించడం ఏదైతే వుందో స్టూపిడిటీకి డెఫినెషన్.

ద్వారకకి డయల్ చేసాను. అతను "హాయ్ హనీ! నేనూ నీ గురించే ఆలోచిస్తున్నాను. ఫోన్ చెయ్యనా అనుకుని, అలిసిపోయి నిద్రపోతూ వుంటావా అని ఆగిపోయాను" అంటాడు.

అది నా భ్రాంతి. లేదా నా ఎక్స్‌పెక్టేషన్. కానీ జరిగింది వేరు, అతను తియ్యలేదు "ద నెంబర్ యూ ఆర్ కాలింగ్ ఈజ్ నాట్ ఆన్సరింగ్" అన్న బొంగురు గొంతు. ఇండియాలోనే నయం కొంచెం అయినా బావుంటాయి స్వరాలు.

అసలు ఈ వాయిస్ రికార్డింగ్ ఇచ్చే అమ్మాయిలు ఎంత కర్కశ హృదయాలు అయివుంటారూ? ఎంతమంది గుండెల్ని ఛిద్రం చేస్తారో కదా రోజుకి.

సరే వాళ్ళ విషయం పక్కన పెడితే ఈ మగమహారాజులా ఫీలవుతున్న ఇతగాడు, నన్ను దింపేసి, గుండెలమీద భారాన్ని కూడా దింపేసుకున్నానన్న ఫీలింగ్‌తో, గొప్ప నిశ్చింతతో వెళ్ళి నిద్రపోతుంటాడా? ఇందాకటి అనుభూతిని నెమరేసుకోడం కూడా లేదా? మా ఫ్రెండ్ రేఖ చెప్పింది. "ఈ వెధవలు పని అవగానే గోడవైపు తిరిగి నిమిషంలో నిద్రపోతారే గురకపెడ్తూ" అని.

నో అఫెండింగ్ అది రేఖ లాంగ్వేజ్. నేను వెధవ అనడంలేదు. ఫూల్ అంటున్నాను. తర్వాత ఆమె తల సవరించి, బుగ్గలు నిమిరి, సున్నితంగా 'థాంక్స్' అని కనురెప్పల మీద ముద్దుపెట్టి, 'పడుకో' అని 'జో' కొడుతూ "ఇందాకా జీవితంలో ఎప్పుడూ అనుభవించని అనుభూతిని ఇచ్చావ్ తెలుసా నువ్వూ?" అనేవాడుంటే ఎంత అదృష్టం..

అసలు అలాంటి వాడుంటాడా? ఎలా తెలుస్తుందీ? కష్టం బాబూ! ఇలా ఆలోచిస్తూ వుండగానే, తెల్లవారిపోయింది. ఎందుకో లేవబోతుంటే ఒళ్ళు తూలింది. అసలు చిన్నప్పుడు 'కో' ఆట ఆడి వచ్చిన తర్వాత వళ్ళంతా ఎక్కడవి అక్కడ

కీళ్ళూ నరాలూ పట్టేసినట్లు నొప్పులు. యాషికని చాలా మిస్ అవుతున్నాను. దానికి ఫోన్ చేసి అడగాలి. ఇలాగే వుంటుందా అని. చెప్తుందా? "అబ్బే నాకేం తెలుసే? నాకేమైనా పెళ్ళయిందా ఏమన్నానా?" అంటుందా?

ఎవర్ని అడగాలీ అని ఆలోచిస్తుండగా ఫోన్ మోగింది. ద్వారక అన్న అక్షరాలు అందంగా కనిపించాయి.

"హలో అయోధ్యా" అన్నాను.

"మిస్డ్ కాల్ చూసాను. ఎనీథింగ్ సీరియస్? స్లీపింగ్ పిల్స్ ఇచ్చాగా హాయిగా నిద్రపోతావ్ అలిసిపోయి అనుకున్నానే" అన్నాడు.

"ఒరేయ్ ఫూల్ అంత మొద్దు నిద్రేంటిరా? పుట్టబోయే పిల్లని లేదా పిల్లాడ్ని కడుపులోనే చంపేసి నేను హంతకురాల్ని అవ్వాలా? అని నేను రాత్రంతా నిద్రపోకుండా ఆలోచిస్తుంటే?" అన్నాను.

ఓ క్షణం నిశ్శబ్దం. తర్వాత పెద్ద నవ్వు వినిపించింది.

"నీలో సెన్సాఫ్ హ్యూమర్ వుందని తెలుసుకానీ ఇంత సెన్సాఫ్ హ్యూమర్ వుందని తెలీదు" అన్నాడు.

"జోక్ కాదు సీరియస్‌గానే ఆలోచించాను" అన్నాను.

"నీకు కొంచెం బుర్ర తక్కువ అనుకున్నాను కానీ. ఇంత తక్కువ అనుకోలేదు" అని మళ్ళీ నవ్వాడు.

"రేయ్ ఫూల్ నిజంగా ఆ పరిస్థితే వస్తే నా ఖర్మకి వదిలేసి నువ్వు హాయిగా ఇలాగే పడుకుంటావు కదూ"

"ఎందుకూ? తీయించకు. మన ప్రేమ గుర్తు అనుకుని పెంచుకుంటా" అన్నాడు.

"పెంచుకుంటా..ఏంటి? నేనెక్కడ చస్తా? నేను వద్దా?" అన్నాను.

"ఓ! పెళ్ళి చేసుకుందాం అంటావ్ అంతేగా. ఇంత డొంక తిరుగుడెందుకు?" అన్నాడు.

"పెళ్ళి అందుకేనా?" అడిగాను.

"నా దృష్టిలో దీనికి కూడా అక్కర్లేదు. ఈ పెళ్ళివల్ల ఒకరిమీద ఒకరికి ఆధిపత్యం అనవసరపు డిపెండెన్సీలూ ఆంక్షలూ.. అపార్థాలూ.. గొడవలూ.. మా మమ్మీ డాడీల్లా విడాకులూ" అన్నాడు.

ఒకర్ని ఒకరు సమానంగా  చూసుకుని, గౌరవించుకుంటూ వుండాలంటే ఇప్పటిలా గొప్ప ప్రేమగా వుండాలంటే ఇంకో మార్గముందా? అడిగాను.

"ఉంది. అందుకు చాలా ధైర్యం కావాలి" అన్నాడు.

"నేను చాలా ధైర్యస్తురాలిని. ఏంటో చెప్పు" అన్నాను.

"కలిసుందాం. పెళ్ళి పక్కకి పెట్టి" సింపుల్‌గా అన్నాడు.

"నన్ను ఉంచుకుంటావా?"

"దాన్ని ఈ కాలంలో లివ్ ఇన్ రిలేషన్ అంటారు" అన్నాడు.

వసుంధర భాషలో ఉంచుకోడం లేచి పోడమే.

"అప్పుడు సామాజిక రక్షణ వుండదు. ఎప్పుడు మోజుపోతే అప్పుడు విడిపోడమేగా. కోర్టుతో పనిలేకుండా? పిల్లల పరిస్థితి ఏవిటీ?" అన్నాను.

"నెగిటివ్ ఆలోచిస్తే ఇవన్నీ పెళ్ళి కాపాడలేదు. పెళ్ళయిన వాళ్ళు ఎక్స్‌ట్రా మేరిటల్ ఎఫైర్స్ పెట్టుకోవడంలేదా? పెళ్ళాంకి విడాకులు ఇవ్వడంలేదా? ఇవేం చెయ్యకుండా కూడా బుద్ధుడిలా పెళ్ళాం పిల్లల్ని వదిలేసి పోవట్లేదా? సమాజం ఏం రక్షిస్తోంది? కోర్టు ఏం పనిష్ చేస్తోంది? ఇంకా చట్టపరంగా అలా చేసే వాళ్ళకి రక్షణ ఇస్తోంది ఇద్దరికీ ఎక్స్‌ట్రా మేరిటల్ ఎఫైర్ ఇష్టం అయితే తప్పులేదని" అన్నాడు.

పొద్దుటే కాఫీ కూడా పడకుండా, ఇలాంటి బుర్ర వేడెక్కి పొగలు కక్కే విషయాలు మాట్లాడాలా?

"నాకేం అర్థంకావడంలేదు. ఒక్కమాట  చెప్పు. నువ్వు ఇవన్నీ ఆలోచించలేదా? నేను అడిగేవరకూ?" అన్నాను.

"లేదు."

"అంటే వన్ నైట్ స్టాండ్ అనుకున్నావా?"

"జన్మ జన్మల అనుబంధం అనుకున్నాను."

"నో జోక్స్.. బీ సీరియస్"

"సీరియస్‌గానే చెప్తున్నాను. అభద్రత వున్న దగ్గరే ఇన్ని ఆలోచనలొస్తాయి. ఐ థాట్ వి ఆర్ ఇన్ లవ్.. ఆ బంధం ఈ పెళ్ళీ సమాజం కన్నా ఎక్కువ అని" అన్నాడు.

ఆలోచనలో పడ్డాను. మంచి పాయింట్ మనసుకి బావుంది. మనుగడకి కష్టం.

"సో మనమేం చేద్దాం అంటావ్?" అడిగాను.

"కాల్ యువర్ పేరెంట్స్. మనిద్దరం ఇక్కడ లివింగ్ టు గెదర్ అని చెప్పెయ్యి."

"అంత సింపుల్ అనుకుంటున్నావా? వసుంధర అక్కడ రాగాలూ, పెడబొబ్బలూ పెడ్తూ, తిరుగు టపాలో వచ్చి నిన్నూ నన్నూ చితగ్గొదుతుంది" అన్నాను.

"సరే! నాకు నచ్చిన అబ్బాయిని గాంధర్వ వివాహం చేసుకున్నాను అని చెప్పు. ఉంగరాలు మార్చుకుందాం" అన్నాడు.

"ఇదేదో బావుంది. దానికి చిన్న ఫంక్షన్ చేసుకుందామా? అందరికీ తెలిసేట్టు?"

"నిన్న రాత్రి మనం చేసిన దానికి  ఫంక్షన్ చేసామా, అందరికీ తెలిసేట్లు?"

"ఛీ!"

"ఇదీ అదే. ఆలోచిస్తూ వుండు. నేను ఆఫీసుకి వెళ్ళాలి. బై స్వీట్ హార్ట్" ఒక ముద్దు పెట్టి ఫోన్ పెట్టేసాడు.

అతను సొల్యూషన్ చెప్పాడా? మరింత కన్ఫ్యూజన్‌లోకి నెట్టాడా ఆలోచిస్తూనే లేచి, బ్రష్ చేసుకుని కిచెన్‌లోకి వెళ్ళాను.

అల్లిన్, పరీ బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్నారు.

సిరీల్స్ పాకెట్‌లోంచి ఒంపుకుని, పాలు పోసుకుని తినడమేగా.

అల్లిన్ విష్ చేసింది. నేనూ విష్ చేసి ఆమె పక్కన కూర్చున్నాను.

"ఇది విన్నావా రిషీ హనీ ఫోన్ చేసాడు" అంటూ ఉత్సాహంగా వచ్చిన మావయ్య, అల్లిన్‌ని చూసి మొహం చిట్లించాడు.

"ఎప్పుడెళ్తున్నారూ?" పరిని అడిగాడు.

"ఏంటి డాడీ నీ ప్రోబ్లం? వచ్చేదాకా చంపుకు తిన్నారు, వచ్చాక ఎప్పుడు వెళ్తున్నావ్ అంటున్నారు?" అంది కోపంగా పరి.

"దీన్ని నువ్వు వెంటపెట్టుకు రావడం నాకు నచ్చలేదు. అసలు మీ ఇద్దరి సంబంధం కూడా నాకు నచ్చలేదు." ఆయన బి.పి పెరిగిపోతున్నట్లు, మొహం ఎర్రబడి, మాటలు తడబడిపోతూ మనిషి నిలువెల్లా వణికిపోతున్నాడు.

చాలా సున్నితమైన విషయం. అల్లిన్ అంతా అర్థమయినట్లు "టెల్ హిం ఎబౌట్ అజ్" అంది.

"డాడీ నీ కూతురు లెస్బియన్ కాదు. భయపడకు" పరి చాలా శాంతంగా చెప్పింది.

"మరి పెళ్ళి వద్దంటావ్? ధీరజ్‌ని కలవవు. వచ్చినప్పుడల్లా దీన్ని వెంట పెట్టుకొస్తావ్ అని టేబుల్ మీద గట్టిగా కొట్టాడూ మావయ్య.

"నేను ధీరజ్‌ని ప్రేమించాను. ఇంకా ప్రేమిస్తున్నాను. అతన్ని పెళ్ళి చేసుకుంటాను, మీకు కావలసిన గ్రాండ్ కిడ్స్ అందిస్తాను ప్రామిస్ నాకు కొంచెం టైం కావాలి" అంది పరిమళ.

"ఎందుకు టైం?" అడిగింది అప్పుడే అక్కడికి వస్తున్న అత్తయ్య.

COMMENTS